
# 7. సైకిలు (ఆత్మకథ)

చిన్నారమ్మా! చిన్నారి!
చిన్న సైకిల్ కొన్నాది.
రోడ్డు మీదికి వెళ్ళింది
భయపడకుండా పడిపోకుండా
రయ్యి... రయ్యి...న తొక్కింది.
కొట్టు వద్దకు వెళ్ళింది.
చాక్లెట్లెన్నో కొన్నాది. .................................. ఇలా



పిన్నలకే కాదు పెద్దలకు కూడాఉపయోగపడే 'సైకిల్'ని నేను. మానవశక్తితో నడపబడే ఒక సాధారణమైన రవాణా సాధనాన్ని నేను. నాకు రెండు చక్రాలు ఉంటాయి. కాబట్టి నన్ను 'ద్విచక్ర వాహనం' అని కూడా అంటారు. నేను దాదాపు 300 సంవత్సరాల క్రితం జన్మించాను. మొదట్లో పెద్ద ఆకారంలో ఉండేదాన్ని. తరువాత మరింత చిన్నగాను, వేగంగా పోయేలాగా తయారు చేయబడ్డాను. మెల్లమెల్లగా పరిణామం చెందుతూ వచ్చాను. నాలో ఒకటొకటిగా రబ్బరు టైర్లు, క్రాంక్, పెడల్, పళ్ళ చక్రం, గొలుసు, స్పోక్‌లు, బాల్‌బేరింగ్‌లు, స్ప్రింగ్ సీటు, గేర్లు వెలిసి అధునాతనంగా తయారయ్యాను.

చిన్న పిల్లలకు మొదటి వాహనం కొయ్య గుర్రమైతే, రెండో వాహనాన్ని మాత్రం నేనే. పెద్దలు పిల్లలకు సైకిలు మాత్రం ఖచ్చితంగా కొనిస్తారు. మొదట్లో సైకిల్ మీద నుంచి కింద పడ్డా ఆత్మవిశ్వాసంతో తిరిగి ధైర్యంగా ఎక్కి తొక్కారంటే ఇక అంతే. మీకు, నాకు శాశ్వతంగా స్నేహం కుదిరినట్టే. అమ్మ దుకాణానికెళ్ళి పాలు తెమ్మంటే పాలుమాలకుండా ఉత్సాహంగా నాపై స్వారీచేస్తూ ట్రింగ్...ట్రింగ్ మంటూ వెళ్తారు. ఇంట్లో నేనుంటే ఇలా పనులన్నీ చక-చకా జరుగుతాయి కదా!

అంతేకాదు నన్ను నడపటానికి ఇంధనం అవసరం లేదు. అందువల్ల ఖర్చు కూడా లేదు. ఏదో చిన్నా-పున్నా రిపేర్లు, పంక్చర్లు అయినా సునాయాసంగా నన్ను ఎత్తుకొని తీసుకెళ్ళొచ్చు. తక్కువ ఖర్చుతో బాగు చేయించుకోవచ్చు. నన్ను తోలడానికి లైసెన్స్ కూడా అక్కర్లేదు. అందుకే చిన్న పిల్లల దగ్గర్నుండి అమ్మమ్మ, తాతయ్యలవరకూ అందరూ నన్ను ఇష్టపడతారు. పాఠశాలలు, కాలేజీలు, దుకాణాలు ఒకటేమిటి! ఎక్కడికంటే అక్కడికి 'సై' అంటూ వెళతాను. అమ్మతో, నాన్నతో లేదా తాతయ్యతో, అక్క, అన్న ఇలా ఎవరితోనైనా ఇద్దరిద్దరుగా వెళతారు. పుస్తకాలు, సంచులు ఒకటేమిటి ఎన్నైనా నా ముందరుండే బుట్ట లేదా వెనకాల స్టాండులో పెడితే చక్కగా మోస్తాను.

మీరు నన్ను ప్రతిరోజు చెమట వచ్చేవరకు తొక్కితే మీ ఊపిరితిత్తుల కార్యదక్షత పెరుగుతుంది. చెమటవల్ల శరీరంలో అధికంగా ఉన్న కొవ్వు కరుగుతుంది. రోగనిరోధక శక్తి (ఇమ్యూనిటీ) పెరుగుతుంది. కాలి కండరాలు బలపడతాయి. ఆరోగ్యంగా ఉంటారు. ఇలా వైయక్తికంగానే గాక సమాజానికి కూడా ఎంతో ఉపయోగపడతాను. ఎలాగో తెలుసా!

ఎక్కువ సంఖ్యలో సైకిళ్ళను ఉపయోగించడంవల్ల ట్రాఫిక్ జాం తగ్గుతుంది. ఇంధనం పొదుపు అవుతుంది. ఇంధనాలతో నడిచే వాహనాలు కాలుష్యాన్ని పెంచుతాయి. సైకిళ్ళను అధికంగా ఉపయోగించడం ద్వారా ఈ సమస్యను తగ్గించవచ్చు. విదేశాలలో నన్ను కోకొల్లలుగా ఉపయోగిస్తున్నారు. రేసింగ్ సైకిళ్ళు, పర్యటన సైకిళ్ళు ఇలా వివిధ అమరికలలో వివిధ రకాలుగా ప్రత్యక్షమౌతున్నాను. ఎవరికి ఏరకం కావాలో అలాంటివి ఎన్నుకోవచ్చు. మరెందుకు ఆలస్యం. ఎంచుకోండి నచ్చిన రకాన్ని. రయ్యి.... రయ్యి.... మంటూ ముందుకు సాగండి. ప్రాణాంతక సమస్యగా పరిణమించిన వాయు కాలుష్యాన్ని అరికట్టండి.

## I. వినండి–సంభాషించండి.

1. కొన్ని రవాణాసాధనాల పేర్లను చెప్పండి.
2. ఇంధనం అవసరం లేకుండా నడిచే కొన్ని రవాణా సాధనాలను చెప్పండి.




## II. చదవండి–ఆలోచించండి–రాయండి.

### పదజాలం పెంపొందించుకుందాం.


కొట్టు = అంగడి, దుకాణం; పరిణామం = మార్పు;
అధునాతనం = ఈకాలానికి సంబంధించిన; పొలుమాలు = సోమరితనం పొందు, బద్ధగించు, జబ్బుపడు; సునాయాసంగా = చాలా సులభంగా; అరికట్టు = నిరోధించు.



## III. వినండి–చర్చించండి–రాయండి.

### అ. జవాబు రాయండి.

1. అధునాతనంగా సైకిల్‌లో వెలిసిన భాగాలు.
2. సైకిలంటే చిన్నపిల్లల దగ్గర్నుండి అమ్మమ్మ, తాతయ్యల వరకు ఇష్టపడతారు – వివరించండి.
3. సైకిలు వలన కలుగు ఉపయోగాలను గూర్చి రాయండి.



### ఆ. కింది వాక్యాల తప్పొప్పులను గుర్తించి రాయండి.

1. నన్ను తోలడానికి లైసెన్స్ అవసరము. (   )
2. నన్ను తొక్కడం వలన కాలికండరాలు బలపడతాయి. (   )
3. ఎక్కువ సంఖ్యలో సైకిళ్ళను ఉపయోగించడం వల్ల ట్రాఫిక్‌జాం పెరుగుతుంది. (   )
4. ఇంట్లో నేనుంటే పనులన్నీ చకచకా జరుగుతాయి. (   )




### ఇ. స్వీయవ్యక్తీకరణ

1. వాయుకాలుష్యాన్ని ఎట్లు అరికట్టవచ్చునో మీ సొంతమాటల్లో రాయండి.
2. గొడుగు ఆత్మకథను గురించి నీ సొంతమాటల్లో రాయుము.

## IV. భాషావగాహన:

### అ. కింది పదాలను విడదీసి రాయండి.

1. ఒకటేమిటి    2. ప్రాణాంతక    3. తయారయ్యాను



### ఆ. కింది వాక్యాలు సామాన్య/సంయుక్తములలో ఏరకమునకు చెందినవో రాయండి.

1. నాకు రెండు చక్రాలుంటాయి. ________
2. నేను పుస్తకాలు, సంచులు చక్కగా మోస్తాను. ________

### ఇ. కింది వాక్యాలలోని ప్రత్యయాలు ఏవిభక్తులకు చెందినవో రాయండి.

1. ఇంధనాలతో నడిచేవాహనాలు కాలుష్యాన్ని పెంచుతాయి. ________
2. చెమట వల్ల శరీరంలో అధికంగా ఉన్న కొవ్వు కరుగుతుంది. ________



### నేనివి నేర్చుకున్నా.

- సైకిల్ పుట్టుపూర్వోత్తరాలు.
- సైకిల్ ఉపయోగాలు.

ఉ.సూ.: ఇతర ఉపయోగకరమైన వాహనాల గురించి వివరించండి.
వి.సూ.: వాహనాలను అవసరమైనప్పుడే ఉపయోగించుకొనవలెను.